

కథ 2012

2

# ముస్తఫా మరణం

అఫ్సర్

'ఆ గదిలోకి మాత్రం తొంగి చూడొద్దు బేటా,' అని కేకేస్తున్న ఫాతిమా ఫుప్మా (అత్తమ్మ) గొంతే వినిపిస్తోంది ఎప్పటిదో గతంలోంచి!

'అబ్బా జాన్‌కి పదోరోజు చేస్తున్నాం,' అని మునీర్‌భాయ్ మూడు రోజుల కిందట ఫోన్ చేసినప్పటి నించీ ఆ కేక గతంలోంచి ఎన్నిసార్లు వినిపించిందో లెక్కలేదు.

ఇవాళ పొద్దున ఫస్ట్‌బస్సు అందుకుని, మధ్యాహ్నంకల్లా ఊళ్లో ఉంటే, పదోరోజుకి అందుకున్నట్టూ ఉంటుంది, మునీర్‌భాయ్‌తో, ఫాతిమా ఫుప్మాతో, గోరిమాతో, అందరితో కాసేపు మాట్లాడినట్టూ ఉంటుందని ఊరికి బయలుదేరాను. మాట్లాడాలి, చాలా మాట్లాడాలి, ముఖ్యంగా ఆ గది గురించి!

ఇప్పుడు మునీర్ భాయ్ అబ్బా ముస్తఫా కన్ను మూశాక, ఆ గది ఏమవుతుంది? అతని వారసత్వంగా ఆ గదిని, ఆ పరంపరని మునీర్ అందుకుంటాడా? తండ్రి ఉండగానే ఆ కుటుంబభారాన్నంతా తన ఒంటరి భుజాలమీద మోసిన మునీర్‌భాయ్ ఇప్పుడేం చేస్తాడు? ముస్తఫా దారిన బయలుదేరిన వందలాది భక్తజనం ఇప్పుడు ఏం చేస్తారు?

చాలా ప్రశ్నలు వున్నాయి. కానీ, నా ప్రశ్నలన్నీ ఆ గదితో మొదలయ్యి చివరికి అక్కడే అంతమవుతున్నాయి.

చూస్తూ చూస్తూ ఉండగానే అనేక రంగులు మారిన అతి సంక్లిష్టమయిన పెయింటింగ్ ముస్తఫా జీవితం. ఆ పెయింటింగ్ ఒక కన్నుకే వివిధ సందర్భాల్లో వివిధ రంగుల్లో కనిపిస్తుంది. ఏ రంగు నిజంగా ముస్తఫా జీవితాన్ని ఆవిష్కరిస్తుందో? నా మటుకు నాకు అది సందిగ్ధ వర్ణ సమ్మేళనం.

అసలు బాబా ముస్తఫాకి మరణమే లేదని కదా ఊరంతా అనుకుంది. అట్లా అని గుడ్డిగా నమ్మేసే అతార్కిక స్థితికి వచ్చేశారు జనమంతా అతని కథలు విని, అతని మాటల మార్మికలోకంలో పడి! ఊరంతా చెప్పే కథలు, చుట్టూరా ఊళ్లన్నీ పాక్కుంటూ వెళ్లిపోయిన కథలు అటు వినీ ఇటు వినీ, 'నిజమేనేమో, ముస్తఫా దరిదాపుల్లోకి కూడా మరణం రాదు పో,' అని నమ్మే స్థితికి నన్ను నేను తోసుకుంటూ వెళ్లిపోయాను.

ప్రళయం అనేది పెను ఉప్పెనలా వస్తే, ముస్తఫా ఆ ఉప్పెన తల మీద నాట్యం చేస్తాడని, అది నిప్పుల రూపంలో వస్తే, అతను ఆ నిప్పులతో ఆడుకుంటాడని గట్టి నమ్మకం ఏర్పడిపోయింది ఊళ్లో! ముస్తఫా అంటే మౌలానా. ఫాతిమా అత్త భర్త. నాతో కలిసి ఆడుకున్న మునీర్, మునాఫ్, ముంతాజ్, మోమిన్, మహమూదాల తండ్రి. అన్నిటికీ మించి, నేను అమితంగా ఇష్టపడే గోరీమా కొంతకాలంపాటు అమితంగా గౌరవించిన వ్యక్తి. గోరీమా మాటల్లో చెప్పాలంటే, 'దీని మాలుమాత్ (ఇస్లాం చదువు) ఉన్నవాడు. భక్తి అంటే ఏమిటో నిజంగా అర్థమయినవాడు.'

కానీ, చివరికి ఈ హోదాలేవీ అతను మిగుల్చుకోలేదు. అన్నిటిని విదుల్చుకుని వెళ్లిపోయాడు, ఆ చీకటి గదిలోకి!

అబ్బా చనిపోయాడని మునీర్‌భాయ్ చెప్పినప్పుడు- నేను కాస్త సందిగ్ధంలో పడ్డాను, వెళ్లగలనా లేదా! వెళ్లినా దాదాపు నా కుటుంబంలాంటి మునీర్ కుటుంబాన్ని చూడగలనా?

మునీర్ నా జిగ్రీ దోస్తు. చిన్నప్పుడు ఊళ్లో మా ఇళ్లు దూరం అనే మాటే కానీ, రోజులో ఎక్కువ భాగం

ఇద్దరం కలిసే వుండేవాళ్లం. ఒకటే క్లాసు కూడా కావడంతో కలిసే చదివేవాళ్లం కూడా. 'మీరిద్దరూ కవలలే మిత్రా?' అని అందరూ సరదాగా కాసేపు, కచ్చగా కాసేపు అనేవాళ్లు. నేను ఊరు మారాను కానీ, వాడితో స్నేహంలో ఏమీ మార్పు లేదు. కాకపోతే, ఇద్దరి మధ్యా ఇప్పుడు సమాచారం అంత వేగంగా బట్వాడా కావడం లేదు, అంతే!

ఒక సాయంత్రం నేను ముస్తఫా గది అరుగు చివర కూర్చొని, ఆ తెల్ల కర్టెను మెల్లిగా లాగుతున్నప్పుడు మోమిన్ చూసి, వెంటనే 'అమ్మీ, అఫూభాయ్ అబ్బాజాన్ గదిలోకి వెళ్తున్నాడు,' అంది. లోపల ఎక్కడో ఉన్న ఫాతిమా ఫుప్మా ఒక్క పరుగున వచ్చి నన్ను లాక్కుపోయి, 'వద్దురా బాబూ, వద్దు! మామయ్య చూస్తే చంపేస్తాడు,' అని సముదాయించింది.

నిజానికి వాళ్ల ఇంట్లో నాకు ఎప్పుడూ ఎలాంటి నిషేధాలూ, ఆంక్షలూ లేవు. అట్లాంటిది ఆ మాట ఒకటికి రెండుసార్లు విన్నప్పుడు చాలా కొత్తగా అనిపించింది. అంతకంటే ఎక్కువగా అది నా లోపల ఒక కుతూహలాన్ని తవ్వుకుంటూ వెళ్లిపోయింది.

ఇంతకీ ఏం ఉంది ఆ గదిలో? మునీర్‌భాయ్‌ది చాలా పాతకాలపు చిన్న ఇల్లు. అంత చిన్న ఇంట్లో కూడా ఒక గది వాళ్ల అబ్బాజాన్ ముస్తఫాకోసం విడిగా ఉంచడం వల్ల తూనీగ రెక్కల మా కాళ్లకి సంకెళ్లు వేసినట్టయింది.

అప్పుడే మాకు బయటి ప్రపంచం కాస్త కాస్త అర్థమవ్వడం కూడా మొదలయ్యింది. ఈ బయటి ప్రపంచంలో ముస్తఫా బాబాగా మారడమూ అర్థమవుతోంది. చూస్తూ చూస్తూ ఉండగానే ముస్తఫా ఆ గదిలోకి పూర్తిగా బదిలీ అయిపోవడమూ, అదే అతని ప్రపంచపు తుదీ మొదలుగా మారడమూ జరిగిపోయాయి.

అదే సమయంలో గోరిమా మాకు ఖురాన్ పాఠాలు మొదలుపెట్టింది. పదకొండేళ్లు నిండేసరికి ఖురాన్ పూర్తి చేసేయ్యాలన్నది అక్కడ మా అన్ని ముస్లిం కుటుంబాలలో ఆనవాయితీ. అరబ్బీ మొదటి పుస్తకం 'అలీఫ్ లామ్ మీమ్' అయిపోయిన వెంటనే, "బచ్చే, నువ్వు ఈ శుక్రవారం నమాజ్ తరవాత ఇంటికి రా. బెల్లం ఫాతెహా చదివించి నీకు ఖురాన్ షరీఫ్ షురూ చేస్తా," అని ముందే గోరిమా ప్రకటించెయ్యడంతో ఇంకో కొత్త ఉత్సాహం మనసులో.

మొదటి అరబ్బీ వాచకం చదివాక అరబ్బీ అంటే అల్లం మురబ్బా అయిపోయింది నాకు. ఓహ్, ఈ అల్లం మురబ్బా కథ కూడా ఒకటి చెప్పాలి- పొద్దున్నే చాయ్‌కి ముందు మీరా సాయిబు అల్లం మురబ్బా తినకపోతే, మాకు తెల్లారినట్టే ఉండేది కాదు. అసలు ఖురాన్ చదవడానికి ముందే కొన్ని ఖురాన్ సూరాలు మా చేత బట్టీ కొట్టించింది గోరీమా. అరబ్బీ మురబ్బాలంత తేలికగా ఆ ఖురాన్ సూరాలు నోటి మీంచి ప్రవహించుకుంటూ వెళ్లిపోయేవి. ప్రతి శుక్రవారం నమాజ్‌లో మౌలానా నోటి వెంట అరబ్బీ వాక్యాలు వినడం కూడా బాగుండేది. జగ్ నే కీ రాత్ (జాగారం) రోజుల్లో కేవలం ఆయన కంఠస్వరంలో అరబ్బీ వినడం కోసం రాత్రంతా మసీదులో ఉండే వాళ్లం. కానీ, చూస్తూ చూస్తూ ఉండగానే ఇవన్నీ మారిపోయాయి. ముస్తఫా గొంతు మారిపోయింది. తీరు మారిపోయింది. ఒక కొత్త మనిషి అతని శరీరంలోంచి దూసుకుంటూ వచ్చినట్టనిపిస్తోంది. మసీదు బయట ముస్తఫా నిర్మించిన కొత్త లోకంలో మాకు చోటు లేకుండాపోయింది, ఆ గదితో సహా.

"ఆ గదిలోకి మీరు వెళ్లకపోవడమే మంచిది రా! మీ సోబత్ పైనున్న అల్లాహ్‌తోనే కానీ, కింద తిష్ట వేసిన ఈ షైతాన్‌తో కాదు," అని ఒకరోజు పని కట్టుకుని గోరీమా చెప్పినప్పుడు, ఆ గదిలోకి వెళ్లి తీరాల్సిందే అని ఖాయం చేసుకున్నాం మేం నలుగురయిదుగురం!

## 2

ఏముంది ఆ గదిలో?

ఇదే, ఇదే ... మా అన్వేషణ అప్పట్లో.

ఆ గదిలోని రహస్యాల శోధన కోసం అప్పటి మా చిన్ని ప్రపంచం ఊహించగలిగిన అన్ని ఊహాలోకాలూ చుట్టి వచ్చేవాళ్లం. ఆ తెల్లటి తెర తొలగించుకుని లోపలికి అడుగుపెడితే, ఏమేం చూడవచ్చు? ఫాతిమా అత్తయ్య ప్రతి రాత్రీ తెరని శుభ్రంగా కడిగి, ఉతికి, మళ్లీ తెల్లారేటప్పటికి ఆ గదికి వేలాడదీసేది. 'ఎందుకు ఫుఫ్మా?' అని దాదాపు రోజూ అడిగేవాణ్ణి.

"చాదస్తం చుట్టుకుందిరా... చాదస్తం. షైతాన్ నెత్తిమీద కూర్చుంటే లోకం అంతా అష్టవంకర్లుగా కనిపిస్తుంది. అట్లుంది మీ మామయ్య వ్యవహారం," అనేది. మునీర్ నా కంటే రెండు మూడేళ్లు పెద్ద అయినా, వాడికి కూడా ఆ వ్యవహారం ఏదో ఖరాగా అర్థమయ్యేది కాదు. కానీ, వాడి మాటల్లో ఒక రకమైన అయిష్టత వినిపించేది. ఆ ఇంట్లో తలకొక ఆలోచన అన్నట్టుగా మారిపోయింది.

ఆ గది చుట్టూ మా ఆలోచనలు ఎంతగా కమ్ముకుని ఉండేవంటే, చాలాకాలం ఆ గది నా కలల్లోకి వచ్చేది. ముస్తఫా స్వయంగా ఆ గదిలోకి మమ్మల్ని తీసుకువెళ్లి, అక్కడి వింత వింతలన్నీ చూపిస్తున్నట్టు, మేం కళ్లప్పగించి వింటున్నట్టు, అక్కడి విచిత్ర వస్తుసముదాయాన్నంతా చేతులతో తాకి తాకి చూస్తున్నట్టు కలలు కనేవాళ్లం. ఆ కలల్ని ఒకరికొకరం చెప్పుకునేవాళ్లం. మునీర్‌భాయ్ అవన్నీ విని, "మీకు ఆ పిచ్చి

బాగా పట్టుకుందిలే... అస్సలు ఆ గదిలో ఏమీ లేదురా బాబూ," అనేవాడు.

"నువ్వు లోపల చూశావా?"

"లేదు... ఎవరినీ లోపలికి రానివ్వడు అబ్బా," అనేవాడు మునీర్.

"మరి నీకెలా తెలుసు?"

"నాకు తెలియదు. నాకు తెలుసుకోవాలని కూడా లేదు," అనేసి అక్కడినించి వెళ్లిపోయేవాడు. గోరీమాని మొదటిసారి ఈ విషయం అడిగినప్పుడు, "ముస్తఫాకి జ్ఞానం మరీ ఎక్కువయి ఏడుస్తున్నాడురా. లేనిపోని ఆశలు, కోరికలు పెంచుకొని ఒట్టి ఊహల్లో బతుకుతూ పోతున్నాడు. ఇట్లాంటి వాటిని అల్లాహ్ అస్సలు క్షమించడు," అని ఆ రోజు ఖురాన్‌లో ఉన్న అల్-బఖ్రా సూరాలు మా చేత బట్టీ కొట్టించింది. అయితే, గోరీమాలో ఉన్న గొప్పతనం ఏమిటంటే, కేవలం బట్టీ కొట్టించి ఊరుకోదు. వాటి అర్థాలు విడమర్చి చెప్తుంది. అయినా, ఆమె చెప్పిన అర్థాలకు మించిన అద్భుత లోకమేదో ఆ గదిలో ఉందని మా నమ్మకం.

మాకు తెలియని, అస్సలు అర్థం కానిదేదో అక్కడ గుప్తనిధిలా ఉందని అనిపించడం మొదలయ్యింది. అప్పుడే కాస్త కాస్త లోకం అర్థమవుతున్న మునీర్ భాయ్‌కి ఈ సంగతులు కొంచెం స్పష్టంగా ఉన్నట్టున్నాయి, అతను పైకి చెప్పకపోయినా!

ఈ ఉత్కంఠలోంచి మేం తేరుకోకముందే, ముస్తఫా ఇల్లు తీర్థక్షేత్రంగా మారింది. నెమ్మదిగా పదుల సంఖ్యలో మొదలైన జనాలు కొద్ది కాలంలోనే వందల్లోకి చేరుకున్నారు. రెండు నెలల తరవాత ముస్తఫా వాళ్లు ఇప్పుడున్న ఇంటికి కొద్ది అడుగుల దూరంలో ఇంకో చిన్న గది కట్టించారు భక్తులెవరో. ఒక తెల్లవారు ఝామున మేం నిద్ర లేచేసరికి, ముస్తఫా బాబా సామాగ్రి అంతా ఆ గదిలోకి మారింది. ఆ కొత్త గది ఎదురుగుండా ఉండే చెట్టుమీద ఆకుపచ్చ జెండా ఒకటి రెపరెప లాడడం మొదలెట్టింది.

'ఇదేం పోయేకాలం?' అంటూ, ఫాతిమా అత్త ఆ రోజు నెత్తీ నోరూ కొట్టుకోవడం చూశాను నేను.

'ముస్తఫా ఏం చేస్తున్నాడో వానికే తెలియదు,' అనేసి ఆ తరవాత ముస్తఫా విషయంలో ఇంకేం మాట్లాడినా అనవసరం అన్నట్టు మౌనంలోకి వెళ్లిపోయింది గోరీమా. కానీ నా లోపల మౌనానికి చోటు లేదు. ఒక అవిశ్రాంత సముద్రమేదో ఘూర్ణిల్లుతున్నట్టు, కొన్ని నల్ల మబ్బుల గుంపులు శరవేగంగా కురవబోతున్నట్టు లోపల ఒక అశాంతి. జరగకూడనిది ఏదో జరుగుతున్నట్లు, అది ఊరిని ఉప్పెనలా ముంచేస్తున్నట్టు ఒక అనిర్వచనీయ భయం.

ఇవన్నీ జరుగుతుండగానే మా నాన్నగారికి ఇంకో ఊరు బదిలీ అయింది. ఆ ఊరికి దగ్గరగానే ఉన్న ఒక పట్నం చేరుకున్నాం. ఆ తరువాత ఊరు కేవలం ఒక జ్ఞాపకం, మునీర్ ఒక చిన్ననాటి దోస్తు మాత్రమే. కానీ, ఆ గది మాత్రం నా మనసు మూలల్లో ఉండిపోయింది. ఆ గది తలుపు మీద వేలాడుతున్న తెల్లటి తెర, గది ముందు చెట్టు మీద పెద్ద జెండా కళ్లముందు రెపరెప లాడడం మానలేదు.

ముస్తఫా బాబా గురించి అప్పుడప్పుడూ ఎవరి మాటల్లోనో వినడం మాత్రమే. ఎప్పుడయినా మునీర్ ఫోన్ చేస్తాడు. ఊళ్లో సంగతులు చెప్తాడు తన తండ్రి గురించి తప్ప. తండ్రి పాత్రని క్రమంగా చెరిపేయాలన్న వాడి ప్రయత్నం నేను ఊళ్లో ఉండగానే కొంత చూశాను. అందువల్ల మేం పట్నం వచ్చాక అతను అసలు తండ్రి ఊసే ఎత్తకపోవడం సహజంగానే అనిపించింది. మునీర్ దృష్టిలో ఆ గది ఒక శత్రువు. ఒక చీకటి గుహ. అజ్ఞానమో, విపరీత జ్ఞానమో ముప్పిరిగొన్న ఒక వలయం. ఇంతకూ ముస్తఫా ఆ గదిలో ఏం చేసేవాడు? ఒకటి మాత్రం నిజం- ఆ గది ఒక్కటే అతని బాహ్య అంతఃర్లోకాల మధ్య వాకిలి. అతనికి ఇల్లు, కుటుంబం, బాధ్యతలు, మసీదు లేవు. భార్యా పిల్లలు ఎవరూ లేరు. తనకోసం వచ్చే భక్త జనం తప్ప. వాళ్లు చేసే వ్రతాలూ పూజలూ తప్ప. వాళ్లకోసం తను ఆ గదిలో దేవుడితో చేసే సంభాషణలు తప్ప!

ప్రతిసారీ భక్తుల విన్నపాలు విన్న వెంటనే ఆ గదిలోకి తను ఒక్కడే వెళ్లి ఒక అరగంట తరవాత బయటికి వచ్చేవాడు. ఆ వ్యవధిలో ముస్తఫా బాబా గురించి రకరకాల కరామత్ కథలు భక్త జనాన్ని ఆవహించేవి.

ముస్తఫా కోసం భజనలూ పూజలూ రోజురోజుకూ పెరిగిపోతున్న కాలంలో, "ముస్తఫా, ఆఖరి రోజున దేవుడి దగ్గర సమాధానం చెప్పుకోవడానికి నీ దగ్గర ఒక్క వాక్యం కూడా ఉండదు. నువ్వు చేస్తున్నది తప్పు. అది ఏ ఇస్లాంలోనూ ఎవరూ చెప్పలేదు. నువ్వు తరగని పాపం మూటగట్టుకుంటున్నావ్," అని గోరీమా ఎన్ని సార్లు హెచ్చరించిందో లెక్కలేదు.

ముస్తఫా వింటే కదా! కానీ, ఒక్క మంచి విషయం ఏమిటంటే ముస్తఫా డబ్బు మనిషి కాదు. అతను తను చేస్తున్న పని నిజంగా ఆధ్యాత్మికంగా ఉన్నతమయిందనీ, పవిత్రమయిందనే భావనలోనే ఉన్నాడు.

అది ఇంకో రకంగా కుటుంబానికి నష్టం. ముస్తఫా బాబాగా రూపాంతరం చెందాక కుటుంబభారం అంతా మునీర్‌భాయ్ తలపైన పడింది. అంత పెద్ద కుటుంబాన్ని మోయలేక అతను నరకయాతన పడ్డాడు. మొత్తం

గా కుటుంబమంతా ముస్తఫా దారిని అసహ్యించుకునే పరిస్థితి కూడా వచ్చేసింది.

"అసలు ఇబాదత్ (భక్తి) అంటే ఏమిటి? కుటుంబాన్ని దిక్కులేకుండా చెయ్యడమా?" అని గోరీమా ఒకటికి పదిసార్లు ముస్తఫాకి నచ్చచెప్పే ప్రయత్నం చేసింది. కానీ, "ఎప్పటికీ ఇదే నా దారి. నా దారిన నన్ను వెళ్లనివ్వండి," అంటూ తన గదిలోకి నిష్క్రమించేవాడు ముస్తఫా.

ఆ గదిలోకి అంతర్థానం కాకముందు ముస్తఫా అయిదు పూటలా నమాజ్ చదివేవాడు. అతని నుదుటి మీది ఆ నల్లమచ్చ దేవుడి సంతకంలా ఉండేది అతని నిష్ఠకి గుర్తుగా.

రంజాన్ నెల వచ్చిందంటే మసీదులో ముస్తఫా ప్రసంగం కోసం ఎదురుచూస్తూ ఉండేవాళ్లం. అతని స్వరంలో ఖురాన్ సూరాలు వీనుల విందుగా ఉండేవి. ఖురాన్ చదవని బతుకేం బతుకు అనిపించేది. గోరిమాకి కూడా ఆ రోజుల్లో ముస్తఫా అంటే గొప్ప గురి. ఇక ఊళ్లో ముస్తఫా మాటకి తిరుగులేదు. ఆ కాలంలోనే ఉన్నట్టుండి ముస్తఫా ఒక తీవ్ర ఆధ్యాత్మిక చింతనలో పడి పోయి, కొన్నిసార్లు కాలం అనే స్పృహ లేకుండా బతకడం మొదలెట్టాడు. అదే అతని మార్గంగా స్థిరపడి పోయింది. ఫోన్‌లో మాట్లాడిన ఒకటి రెండు ముక్కల్ని బట్టి మునీర్ భాయిని అర్థం చేసుకోవడం కష్టమే. ఆ తండ్రి మరణాన్ని మునీర్ ఎట్లా తీసుకున్నాడో నాకు సందిగ్ధంగానే ఉంది. ముస్తఫా రహస్యగది గురించి ఉన్న సందిగ్ధం లాంటిదే ఇది కూడా!

నేను బస్సు దిగేసరికి మునీర్ నా కోసం బస్ స్టాపు దగ్గర ఎదురు చూస్తూ నిలబడి ఉన్నాడు.

## 3

ఏం మాట్లాడాలో అర్థంకావడం లేదు. ఇంకా నా మనసు నిండా ఆ గది ఒక్కటే ఆవహించి ఉన్న మాట నిజం.

"ఇక్కడ చాయ్ తాగి పోదాం," అని తనే అన్నాడు.

బస్‌స్టాప్ దగ్గర టీ కొట్టులో రాజు నన్ను గుర్తుపట్టి, "ఎట్లున్నవ్ సారూ?" అని అడిగాడు.

"మంచిగే," అని టీ తీసుకొని ఇద్దరం పక్కనున్న చెట్టుకింద నిలబడి తాగాం. టీ తాగుతున్నంతసేపూ మునీర్ మా ఇంటి విషయాలు అడిగి తెలుసుకున్నాడు తప్ప తన ఇంటి విషయాలేవీ చెప్పలేదు. నాకు కూడా వెంటనే అడగాలని అనిపించలేదు. నడుస్తున్నప్పుడు అడుగుదాంలే అనుకున్నా.

మునీర్ అసలే మౌని. ఇప్పుడు ఇంకా ఘోర మౌనిగా మారినట్టు వాడి తీరుని బట్టి అర్థమయింది. మనిషి ముఖం బాగా అలసిపోయినట్టు పీక్కుపోయి ఉంది. తలలో సగం వెంట్రుకలు నెరిసిపోయాయి. శరీరం బలహీనంగా ఉంది. అన్నివిధాలుగా అలసి పోయాడా అనిపించింది. ముస్తఫా బాబాగా మారి మనిషిగా ఎంత విఫలమయ్యాడనేదానికి ప్రత్యక్ష సాక్ష్యంగా ఉన్నాడు మునీర్. కుటుంబం బరువు మోసీ మోసీ మునీర్ వీపు నిజంగానే బాగా వంగిపోయినట్టుగా అనిపించింది. ముస్తఫా మరణం గురించి ఎక్కడ మొదలు పెడదామా అనుకుంటూ ఉండగానే వాళ్ల ఇల్లు వచ్చేసింది. ఫాతిమా అత్త, మునీర్ తమ్ముళ్లూ, చెల్లెళ్లూ నన్ను చూడగానే సంతోషం వ్యక్తం చేశారు.

గోరీమా కూడా అక్కడే ఉంది. నన్ను చూడగానే దగ్గరకి తీసుకుని నా తల నిమిరింది. చాలాకాలం తరవాత గోరీమాని చూడడం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది. ఆమె మొహంలో అదే ప్రశాంతత.

నేను వసారాలో కూర్చొని ముస్తఫా గది కోసం చుట్టూ చూశాను. మధ్యాహ్నం పదోరోజు ఆచారాలన్నీ ముగిశాక, ఉన్న కొద్దిమంది చుట్టాలూ వెళ్లిపోయాక, కాసేపు కుర్చీలోనే కునుకు తీశాడు మునీర్. అతని ముఖంలోకి చూస్తూ ఉండిపోయాను. అతనిలో ఒక అశాంతీ ఉంది, ఒక ప్రశాంతతా ఉంది. ఒక విషాదమూ ఉంది. ఒక ఉపశమన రేఖ కూడా ఉంది. నాకు కర్బలా యోధుడిలా కనిపిస్తాడు మునీర్ ఒక్కోసారి. ఆ యుద్ధ క్షేత్రంలో కనీసం కొంతమంది అయినా మిగిలారు- కానీ, ఈ కర్బలా మైదానంలో అతనెప్పుడూ ఒంటరి యోధుడే అనిపిస్తాడు. ఎన్ని యుద్ధాలు కలిస్తే ఒక జీవితం! ఆధ్యాత్మికత గొప్ప శాంతి కావచ్చు, గొప్ప యుద్ధమూ కావచ్చు.

కానీ, జీవితం మాత్రం అనేక యుద్ధాల గందరగోళమే! అన్ని యుద్ధాలు చెయ్యలేకనే, ఆధ్యాత్మికత అనే ఒకే ఒక యుద్ధంలో మునిగిపోయాడా ముస్తఫా? ఏమో? ముస్తఫా యుద్ధం ఏమిటో నాకు తెలియదు. మునీర్‌కీ తెలియదు. గోరీమాని అడిగితే ఒకసారి, "ఆధ్యాత్మికత అనేది మైదానం లాంటిది. దిగంతం కనిపించాలి. పైన ఆకాశమూ కింద నేలా కనిపించాలి. అంతేకానీ, అది ఇరుకు గది కారాదు," అని ఒక్క వాక్యంలో తేల్చేసింది. అవునా? అల్లా ఏడు ఆకాశాలు అన్నాడే కానీ, ఏడు నేలలు అని ఎక్కడయినా అన్నాడా? తెలియదు. చాలా విషయాలు తెలియవు.

ముస్తఫా ఒక తేలికపాటి స్వర్గాన్ని ఇక్కడ జనం కోసం నిర్మించి పెట్టాడు. ఆ కొద్దిపాటి స్వర్గమే చాలు

అనుకుని, ముస్తఫాలోనే ఆ దేవుడిని ఊహించుకున్నారు జనం. కానీ, తన వాళ్లందరికీ ముస్తఫా కేవలం షైతాన్! ఈ తేడా ఎక్కడుంది? నా ఆలోచనల్ని తెంపుతూ, "అలా బయటికెళ్దామా కాసేపు?" అన్నాడు మునీర్ అప్పుడే కన్ను తెరుస్తూ.

"చాయ్ తాగి పోరాదా?" అంది ఫాతిమా అత్తయ్య. మేం సరే అనేలోపే రెండు గ్లాసులు మా ముందు పెట్టింది.

ఆమె కళ్లు ఎప్పుడూ ప్రశాంతమయిన రెండు నదులు. ఆ నదిలో రాయి విసిరితే, ఆ రాయిని కడుపులోకి లాక్కువెళ్తుంది అది. ఒక్కటంటే ఒక్క చిన్న వలయం కూడా కనిపించదు. ఏ స్థితినయినా ఒకే ఒక్క నిర్మమకారంతో స్వీకరించే నిరాడంబరమయిన, నిర్మలమయిన కళ్లు ఆమెవి.

అన్నేళ్లు తనతో కలిసి ఉండి, ఇంతమంది పిల్లలకు కలిసి జన్మ ఇచ్చిన భర్త శరీరం చల్లబడిపోయిన క్షణాన ఆమె ఎలా ఉండింది? అందరిలా గుండెలు పగిలిపోయేలా, నేలకి చేతులు బాదుకొని బాదుకొని ఏడుస్తూ ఉండిపోయిందా? అలా జరిగి ఉండకపోవచ్చు. ఒక మూలలో ఆరిపోయిన దీపంలా ముడుచుకుని కూర్చోనిందా? ఏమో... అలా కూడా ఊహించలేను.

మునీర్ చాయ్ కానిచ్చేసి, "పద బయటికెళ్దాం," అన్నాడు.

"ఒరేయ్, అడుగుదాం అడుగుదాం అనుకుంటూ నువ్వేం అనుకుంటావో అని సందేహిస్తున్నా. అబ్బా మరణం గురించి బయటి జనాలకి చెప్పలేదా?"

"ఊళ్లో తెలుసు. బయట ఊళ్లలో తెలియదు. కావాలనే చెప్పలేదు."

"ఎందుకు?"

"ఇదంతా మాకిష్టం లేదు. నీకు తెలుసుగా. నేనూ, అమ్మా, గోరీమా మొదటి నుంచీ వీటన్నిటికీ దూరమే."

"అవును, నాకు తెలుసనుకో. ఫుప్మాకి అస్సలు ఇష్టం లేదు ఈ దారి."

"అసలు ఇది దారి కూడా కాదు నన్నడిగితే. ఒక దారి మళ్లింపు. దేవుడు ఒక ముసుగు. భక్తి ఒక వంచన!"

"అర్థమయ్యింది. కానీ, ఆ మనిషి పోయాక ఆ విషయం అనవసరం కదా!"

"ఎందుకో ... ఇదంతా మా లోపల చాలా అసహనాన్ని కలిగించింది. కొన్నేళ్ల నివురు పేరుకుపోయిన నిప్పు. తట్టుకోలేని స్థితి కూడా వచ్చేసింది." అంతకంటే ఎక్కువగా వాడిచేత మాట్లాడించడం నాకు ఇష్టం లేకపోయింది. నిజానికి ఈ విషయంలో వాళ్లంతా ఎలా ఫీలవుతున్నారో నాకు తెలియంది కాదు కదా!

"మరి, ఆ గది?"

"చూస్తావా? చూపిస్తా. పద!" అంటూ, ఆ గది ఉన్న చోటుకి ఆ జెండా చెట్టు దగ్గరకి తీసుకెళ్లాడు. అక్కడ గది లేదన్న విషయం నేను వచ్చిన మరుక్షణమే గుర్తించాను. కానీ, పొరపడ్డానేమో అనుకుని వెంటనే ఏమీ అడగలేదు.

"ఇదే గది ఉన్న చోటు," అని చూపించాడు. ఆ చోటులో గతంలో ఒక గది ఉన్న జాడ కూడా లేదు. అంతా చదునుగా ఉంది. "అది కూలగొట్టాం, అబ్బా పోయిన మర్నాడే!" అన్నాడు మునీర్.

"అవునా? అంత వెంటనేనా?"

"అవును. దానికి ఏ రకమయిన కొనసాగింపు ఇవ్వడం మాకు ఇష్టం లేక పోయింది. ఆ కథ అక్కడితో ముగించడం లోకానికి, మాకూ మంచిదని అనుకున్నాం," అన్నాడు చాలా స్పష్టంగా మునీర్.

నేను అక్కడే ఉన్న ఒక రాయి మీద కూర్చొని, కాసేపు ఆ గది ఉన్నట్టే ఊహించుకున్నాను. నన్ను చిన్నప్పటినించీ వెంటాడిన ఆ గది ఇప్పటికీ నాకు ఊహగానే మిగిలింది. ఆ కనిపించని గది చుట్టూరా ముస్తఫా నీడ ఏదో తారట్లాడుతున్నట్టుగా అని పించింది.

"సర్లే... ఇక వెళ్దాం పద," అన్నాడు మునీర్ చాలా మామూలుగా. నా ఆలోచనల్లో ఆ గది ఇంకా నిలబడే ఉందన్న విషయం గుర్తించి కూడా గుర్తించనట్టు. "ఆ గది ఎప్పటికీ నాకు ఒక చీకటి గుహ. దేవుడు ఉన్నాడని నేను గట్టిగా నమ్ముతాను కానీ ఈ చీకటి గదుల్లోనో, విచిత్ర శక్తుల్లోనో, గుహల్లోనో ఉన్నాడని మాత్రం ఎవరు చెప్పినా నేను నమ్మను. దాన్ని కూల్చినప్పుడు నాకు ఆ చీకటి నుంచి విముక్తి దొరికింది," అన్నాడు బయటికి వస్తూ.

"ఈ కథ ఇలా ముగిసిందా?" అన్నాను పైకే.

"అవును, కొన్ని కథలకు మనమే బలవంతంగా ముగింపు ఇవ్వాలి," అన్న మునీర్ వాక్యం ఆ రోజు నన్ను నిద్రపోనివ్వలేదు!

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 29 జనవరి 2012*

